స్కెచ్

# 'ధైర్యే సాహసే లక్ష్మీ'

ఇచ్ఛాపురపు జగన్నాధరావు

పాఠం చెప్పడం పూర్తిచేసి, అమ్మాయి వెళ్ళి పోగానే తానూ తిరిగి వెళ్ళడానికి సిద్ధపడ్డాడు సుదర్శనం. మామూలుగా ఈ సమయానికి పద్మిని అక్కడికి రావడం అలవాటు— పాఠాలు ఎలాసాగుతున్నాయో తెలుసుకోడానికి.

సున్నితంగా గదిలోనికి వచ్చిన అడుగుల సవ్వడి సుదర్శనానికి మొదట వినపడలేదు. కాని, గాలిలో తేలుతూవచ్చిన పరిమళాలు ఆమె రాకని అతనికి సూచించాయి.

"వసంత నిన్నరాత్రి తెగచదివిందండీ! ఇవాళ ప్రశ్నలు వేసినట్టున్నారు. ఏమైనా చెప్పిందా?"

"బాగానే చెప్పింది— తెలివైనది వసంత."

—ఇలాగ, రోజూలాగే సంభాషణ ప్రారంభించడంతో చాలా బాధపడ్డాడు సుదర్శనం. ఆమె తనకి తానే ఆ ప్రసక్తి తేవకపోతే, తానే తేవాలి. అది అంత సరసంగా ఉండదు... కాని...

"మీరంటే దానికి భక్తి కుదిరింది...ఇంతకు ముందు ఇద్దరు మాస్టర్లని పెట్టేము. వాళ్లని అసలు ఖాతరుచేస్తేనా అది!"

ఆమెవంక చూస్తూ అలాగే నిలబడిపోయాడు సుదర్శనం. మంచులాటి తెల్లని చీరా, దాని పల్చదనంలోనించి దొంగచూపులు చూస్తూన్న బ్లౌజూ, దాని వెనుక... మెడ లేతలేతకాంతుల్లో ఎత్తుపల్లాలలో సంతృప్తిగా నిద్రిస్తోన్న బంగారు గొలుసు... ఈ రోజు ఆ గొలుసుని చూస్తూంటే అతని మనసులో వివిధ భావాలు బలంగా రేకెత్తుతున్నాయ్.

"వెడతాను..."

నీరసంగా అన్నాడు. "అప్పుడే!—ఒక్క క్షణం ఆగండి" అని బయటికి వెళ్ళి తిరిగివచ్చి ఆమె... అట్లా ఊహించాడు సుదర్శనం... కాని...

"మంచిదండీ—"

నీరసంగా అడుగులు వేసుకుని బయటికి నడిచాడు సుదర్శనం తనని తాను తిట్టుకుంటూ. పిరికి పంద తను. తన దానికోసం—తన హక్కు కోసం కూడా నోరెత్తలేడు తను.

పద్మినిని చూసి భయమా తనకి?

ఔను — కాదు...పోనీ, ఆ విషయం వాళ్ళ నాన్నగారితో మాట్లాడితే?

అది మరీ తప్పుగా కనిపించింది. ఈ వ్యవహారంలో బాధ్యత అంతా పద్మినిదే... ఆమె మరీ చిన్నపిల్ల కాదు. ఇప్పటికే తన పిరికితనంవల్ల ఇంత ఆలశ్యం ఐపోయింది!... రేపు, ఎలాగేనా తాను సాహసించి తీరాలి. లేకపోతే...

నీరసంగా రూములోకి వచ్చి మంచంమీద వాలాడు సుదర్శనం. గది అంతా ధూళితో, చిన్న చిన్న వస్తువులతో చిందర వందరగా ఉంది. కాని, యిప్పుడు అదేమీ తనని బాధించడంలేదు. వీటన్నిటికి ఒకే ఒక పరిష్కారం. అది పద్మిని చేతుల్లో ఉంది. ఆ సుందర కోమల హస్తాలు తన వైపు జాచి ఆమె...ఆలోచన సాగలేదు సుదర్శనానికి.

కడుపు గోడవ చేస్తోంది. కాని, ప్రస్తుత అసర్థ పరిస్థితులు హోటలుకిపోయి భోజనం చేసేశక్తి లేకుండా చేశాయి తనకి. లేచి, ఎదురుగా ఉన్న టీ దుకాణంలో పకోడీలు తిని టీ త్రాగి తిరిగివచ్చి మళ్ళా మంచంమీద వాలేడు సుదర్శనం.

నిద్రపట్టదు.

గోడలోని పెద్ద ఖాళీలోనించి చంద్రోదయం కనిపించింది. కళ్ళు తెరిచేసరికి సుదర్శనానికి వెను వెంటనే కలువలూ, పద్మాలూ, జ్ఞాపకం వొచ్చి పద్మిని మనసులోనికి వచ్చింది...

ఈ బాధ తాను భరించలేడు. రేపు సాహసించి ఆమెని అడగకపోతే, తన బతుకే దుర్భరం ఐపోతుంది. ఒకవేళ ఆమెకు కోపంవచ్చి వ్యవహారం మొదటికి చెడితే?

ఏమైనా, తనకున్న ఈ ఒక్క ఆశా వృథా చేసుకోదల్చ లేదు. అంతగావొస్తే అప్పుడేదో చెయ్యవచ్చు. అయినా, పద్మిని అంత అమానవంగా ప్రవర్తిస్తుందా?

ఆలోచనలతోనే తెల్లారినట్లనిపించింది. సూర్యోదయం—పద్మిని...

ఈ రోజు తేల్చుకోక తప్పదని నిశ్చయించుకున్నాడు సుదర్శనం.

• • •

మళ్ళా ఆ తతంగం అంతా అయి, పాఠం ఎలాగో పూర్తిచేసి, వసంతని బయటికి పంపేశాడు సుదర్శనం. వెనువెంటనే పద్మిని లోపలకి రానే వచ్చింది.

మనసు దిటవు పరుచుకుని, ధైర్యే సాహసే లక్ష్మీ, అని అనుకుని... "మిమ్మల్ని ఒకటి అడగాలనుకుంటున్నాను..." అన్నాడు సుదర్శనం నీరసంగా—రాత్రి తాను పడిన బాధని నెమరువేసుకుంటూ.

"ఏమిటి?" అంది తేలికగా పద్మిని.

ధైర్యంగా, గంభీరంగా, అనేశాడు సుదర్శనం, "ఈ నెల జీతం మరిచిపోయారనుకుంటాను ... జ్ఞాపకం చేద్దామని..."

"అయ్యో! నాన్నగారు మొన్ననే ఇచ్చారు. నా మతి!" అంటూ పద్మిని లోపలికి వెళ్ళింది.

దిగ్విజయంచేసి, దివ్యసుఖాలన్నీ ఒక్కసారి చవిచూసినంత ఆనందం వచ్చింది సుదర్శనానికి. తన సాహసం వృథా కాలేదు! ★

---

(10-వ పేజీ తరువాయి)

ఉంటే సరిపోతుంది. ఆకాశంలోలా దీపాల సైనులు, అన్ని రకాల ప్రచార దీపాలూకూడా కొత్తగా రాబోతూన్న బిల్లులో వుండాలి. అప్పుడే వాటిమీద ఒక కంట్రోలు వుంటుంది. అప్పుడే వీటి విపరీతపు పోకడలనీ, పబ్లికుకి యివి కల్గిస్తూన్న న్యూసెన్సూ అరికట్టడం జరుగుతుంది. నిజమే. ఇలాంటివి అమలులోకి తేవడానికీ, సరియైన ఫలితాల నియ్యడానికీ కూడా కొంతకాలం పడుతుంది. ఈలాగా ఉన్న చట్టాల నాధారంగా చేసుకొని ప్రభుత్వం కొంత పని చెయ్యవచ్చు. పోస్టర్లూ ఆవీఅంటించి ప్రైవేటు యిళ్లగోడలూ పబ్లికు బంగళాల గోడలూ అసహ్యంగా తయారు చేసిన వారిచేత అవి పరిశుభ్రం చేయించేందుకు తగిన రూల్సు తయారుచేయాలి. అప్పుడే యీ వేగం కొంతతగ్గి ఎక్కడ అంటించాలి యీపోస్టరు? అన్న ఆలోచన అయినా వస్తుంది!

• • •

ఇదంతా కంఠశోష! సివిక్ సెన్సు అన్నది ఉన్న ప్రజానీకానికి లేని యీపట్టణ సౌభాగ్యంగొడవ ఎవరికి కావాలి? అంటారు కొందరు. కాని ఆ కొందరి కోసం పట్టణపు అందం మంట కలపనక్కరలేదు. అడుగు వేసి అడుగు వేస్తేనే అసలు ప్రయాణం. కూర్చున్నప్పుడే కూర్చుని ఎక్కడికేనా వెళ్ళాలంటే కుదరదు. అలాగే యిలాటి విషయాలలోనూ, మెల్లిమెల్లిగా చర్యలు తీసుకోవడం ప్రారంభిస్తే కొంతకాలానికి మనం కోరుకొన్న విషయాలని అమలులోకి తేగల్గుతాం. లేకుంటే అంతే.

గోడలమీద యీ పోస్టర్లనీ, బొమ్మలనీ చూసి అసహ్యించుకుంటున్నా రంటావు; పుస్తకాలలో అంటే పత్రికలలో రసవత్తరం అయిన కథమధ్యలో మనని ఆపేసి చదివించే "విషయాల"కి నువ్వేం చెప్తావు? అని నిలవేసి ప్రశ్నిస్తే సమాధానం నా దగ్గిర లేదు. ఎందుకంటే సీరియల్ కథ గబగబా చదివేస్తూంటే మధ్యలో బాక్సుకట్టి వుంటుంది: "కలవరపడు స్త్రీలకు!" అంటూ. లేదా—పుర్ర మీ అదృష్టం చెప్తుంది! అని. హాస్యకథలూ జోకులూ బాక్సుకట్టివేస్తారు. అలాగే యీ చిత్ర ఎడ్వర్టైజుమెంటులూ వేయడంతో వస్తూంది చిక్కు. పత్రికలో చివరి పేజీలో మొదటి పేజీలో యీ రకం "ప్రచారాలకి" వదలిపెట్టి చదివే సంగతులు అలా వదిలేయకూడదూ?

ప్రభుత్వాలు తల బెడుతూన్న బిల్లు యిలాంటి పత్రికల్లో వచ్చే వాటికి చెందుతుందా చెల్లదా? అదీ నిజమే లెండి: చాలామంది పత్రికలు వింత చిరునామాల కోసం, కొత్త ఎడ్వర్టైజు మెంట్ల కోసం కొంటారు! అవి లేకుంటే పత్రికలు దెబ్బతింటాయి—(రుద్రాణి)